చిత్రమైనది విధి నడక

టెంపోరావ్

నాగేష్ ఎమ్మే పాసయ్యాడు. గత రెండేళ్ళుగా ఉద్యోగం కోసం అన్వేషిస్తూ మూడువందల ఇంటర్ వ్యూలకు వెళ్ళాడు. కాని ఉద్యోగం రాలేదు.

ఇల్లు నడవడానికి తల్లి ఒంటిమీద వున్న నగలన్నీ కరిగిపోయాయి. వారం రోజులనుంచి తల్లి పదేపదే చెప్తోంది, "ఒరేయి, అమ్మడానికి ఇంక ఏమీ లేదురా! కూలి పనేనా చేసి నువ్వు ఇటుపైన ఇల్లు నడపాలి!"

"నువ్వు బెంగపెట్టుకోకమ్మా! మనం చచ్చిపోం, ఏదో చేసి బతుకుతాం" అన్నాడతను ధైర్యంగా.

ఏం చేయాలా అని ఆలోచిస్తూ ఆనాటి సాయంత్రం నాగేష్ బజారువైపు వెళ్ళాడు.

మనియన్ స్టోర్సు ముందు అతను నిలబడ్డాడు. ఏదీ కొనాలనే వుద్దేశం లేదతనికి. జేబులో చిల్లర మాత్రం వుంది.

ఒకతను వేగంగా షాపు ముందుకువచ్చి యజమానికేసి చూశాడు. చేతిలో వున్న కాయితాన్ని యజమానికిచ్చాడు.

"ఈ వస్తువులన్నీ మా ఇంటికి వెంటనే పంపండి. మొత్తం నాలుగొందలు లోపున వుంటుంది. మొదటి వారంలో డబ్బు మీ మనిషికిచ్చేస్తాను" అన్నాడతను.

"అలాగే సార్" అన్నాడు మనియన్ నవ్వుతూ.

నాగేష్ వాళ్ళ మాటలు విన్నాడు. ఏదో అతడి మెదడులో మెరిసింది. ఆలోచిస్తూ అతడు రోడ్డమ్మట నడవసాగాడు.

కొంతదూరం వెళ్ళేసరికి పద్మరాజు యెదురయ్యాడు. అతడు కూడా తనున్న స్థితిలోనే వున్నాడు. బి.ఎ. పాసయి నాలుగేళ్ళయింది. వుద్యోగంలేదు. తండ్రికి పెన్షను వస్తోంది. దానితో సంసారం సాగిపోతోంది.

"రాజూ, యెందాకా?" అడిగాడు నాగేష్.

"నువ్వు కనిపించాక ఆ ప్రశ్న అనవసరం. అలాపోదాం పద!"

ఇద్దరూ రైలు పట్టాలవైపు నడిచారు. పద్మరాజు చేతిలో నల్లటి ప్లాస్టిక్ బాగ్ వుంది. పట్టాలకు దూరంగా గడ్డినేలమీద ఇద్దరూ కూర్చున్నారు.

పట్టాలకు ఇటూ, అటూ దూరంలో ఇళ్ళు వున్నాయి. నాగేష్ చూపు నలువైపులా వెళ్ళింది. జోలార్‌పేట ఎక్స్‌ప్రెస్ వాళ్ళ పక్కనుంచి దూసుకుపోయింది.

"టైము ఆరు కావస్తోంది" అన్నాడు నాగేష్.

ప్రతిరోజూ అదే టైముకు ఆ ఎక్స్‌ప్రెస్ వెళ్తూ వుంటుంది.

"రమ్ము తెచ్చాను. డోస్ వేద్దామా?" అడిగాడు

పద్మరాజు.

"ఎంత? యెలా సంపాదించావు?"

పద్మరాజు నవ్వాడు.

"పారిజాతం వైన్ షాపు వుందిగా! ఆ షాపులో వుండే సుబ్బు నా ఫ్రెండ్. పొద్దుట ఒకతను విస్కీ కొని వందరూపాయల నోటు ఇచ్చాడు. షాపులో చిల్లర లేక నన్ను కాపలా వుంచి సుబ్బు పక్క షాపుకు పరుగెత్తాడు. ఆ క్షణంలో హాఫ్ బాటిల్ రమ్ తీసి పాంటు జేబులో దాచేశాను."

"విస్కీ కొట్టేయవలసింది!"

"సమీపంలో రమ్ వుంది. దానితో తృప్తిపడ్డాను" అన్నాడు పద్మరాజు.

"రమ్ బెటర్ దెన్ నతింగ్!" అన్నాడు నాగేష్.

పద్మరాజు బాగ్ జిప్పర్ లాగి తెరిచాడు. హాఫ్ బాటిల్ హెర్క్యులస్ రమ్ తీసి కింద పెట్టాడు. రెండు గ్లాసులను పైకితీశాడు. నీళ్ళతో నిండిన ఒక బాటల్ను బయట వుంచాడు.

"రాజూ, నువ్వు అన్నీ సలక్షణంగా తెస్తావు! సిగరట్లో?"

"అవి మర్చిపోతానా?" అంటూ పాంటు జేబులోంచి ఛార్మినార్ ఫిల్టర్ పాకెట్, అగ్గిపెట్టె తీసి బయట పడేశాడు.

"యూ ఆర్ జీనియస్!" అరిచాడు నాగేష్.

బాగ్ లోంచి మరో పాకెట్ తీసి పద్మరాజు బయట పెట్టాడు. లోపలున్న పకోడీలు బయటకు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

"మెజీషియన్ లా అన్నీ బయటకు లాగుతున్నావు. నీ

బాగ్ అక్షయపాత్రలా వుంది!" అన్నాడు నాగేష్.

రెండు గ్లాసుల్లో నాగేష్ రమ్ పోసి, బాటిల్ లోని నీళ్ళు పోశాడు. సూర్యుడు అస్తమించాడు. గడ్డి నేలమీద గ్లాసులు మెరుస్తున్నాయి.

"చీయర్స్!" అని ఇద్దరూ తాగటం ప్రారంభించారు.

ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు. అప్పుడే గూడ్స్ ట్రెయిన్ పట్టాలమ్మట కదిలిపోతోంది.

చీకటిపడింది. ఇద్దరూ నిషాలో వున్నారు.

"రాజూ, డబ్బు గడించడానికి ఒక గొప్ప పద్ధతిని నేను కనుక్కున్నాను. నువ్వు నాతో చేర్తావా?" అడిగాడు నాగేష్.

"తప్పక చేర్తాను."

"అయితే, కమాన్ లెటస్ జాయిన్ హేండ్స్!"

ఇద్దరూ చేతులు కలిపారు.

"మనం ఏం చెయ్యాలి?"

"నా ప్లాను మెదడులో వుంది. త్వరలో నీకు దాన్ని గురించి వివరంగా చెప్తాను. ప్రస్తుతం ఒకటి మాత్రం చెప్పగలను. ధైర్యంచేస్తేగాని డబ్బురాదు. మనం తెగించాలి."

"అది నాకు చెప్పాలా? నేను తెగించే ఈ రమ్ బాటిల్ కొట్టుకొచ్చాను."

గ్లాసులోని రమ్ తాగేసి అతడు బాటిల్ వంక చూశాడు. మరో బడా పెగ్ ఇద్దర్కీ వస్తుంది. నాగేష్ రెండు గ్లాసుల్లోనూ రమ్ పోశాడు. నీళ్ళు పోశాడు.

"రాజూ, అనుకోకుండా ఇవాళ హేపీగా సాగిపోతోంది. గుడ్ రమ్, సిగరెట్లు" అన్నాడు నాగేష్.

"మనం యెప్పుడూ ఇలాగే సుఖంగా బతకాలి!"

అన్నాడు పద్మరాజు.

చుట్టూ చీకటిగా వుంది. నాగేష్, పద్మరాజు వుషారుగా సిగరెట్లు వెలిగించారు.

"రాజూ, ఇవాళ పేదరికానికి గుడ్ బై చెప్పేస్తున్నాను. ఇటు పైన అది మన దగ్గరకు రాకూడదు!" అన్నాడు నాగేష్.

"గుడ్ బై" అన్నాడు పద్మరాజు.

గ్లాసులనూ, ఖాళీ బుడ్డీలనూ పద్మరాజు బాగ్ లో పెట్టి జిప్పర్ మూశాడు. ఇద్దరూ తూలుతూ లేచారు.

2

పద్మరాజు సైకిల్ని వేగంగా పోనిస్తున్నాడు. వెనుక కూర్చున్నాడు నాగేష్.

కొంచెం దూరంలో ముందుగా వెళ్తున్నాడు మనియన్ స్టోర్స్ మనిషి రాజన్.

పద్మరాజు వేగంగా వెళ్ళి ముందు వెళ్తున్న రాజన్ సైకిల్ని బలంగా ఢీకొట్టాడు. సైకిల్ రోడ్డువారకు మళ్ళి పక్కకు పడింది. రాజన్ సైకిల్ కింద వున్నాడు.

నాగేష్, పద్మరాజు చటుక్కున కిందకు దిగి అతడి వైపు వెళ్ళారు. సైకిల్ని తీసి రాజన్ని లేవదీశారు.

ఏదో రాయి తగిలి రాజన్ మోకాలు నుంచి రక్తం కారోంది.

"చూడకుండా సైకిల్ తొక్కుతున్నారు!" అరిచాడు రాజన్.

"లారీ మామీదకు వస్తుందేమో అని భయపడి పక్కకు తిప్పాను. నీ సైకిల్ అడ్డొచ్చింది" అన్నాడు పద్మరాజు.

"అయిందేదో అయింది. వెంటనే డాక్టర్ దగ్గరకెళ్ళి

బాండేజి వేయించుకో!" సలహా ఇచ్చాడు నాగేష్.

తన జేబులో వున్న కాయితాన్ని నాగేష్ రహస్యంగా తీయడం రాజన్ గమనించలేదు!

డాక్టర్ దగ్గరకు వెళ్ళడమా, వద్దా అని రాజన్ ఆలోచిస్తున్నాడు.

"అశ్రద్ధ చేయకు! డాక్టర్ దగ్గరకు వెళ్ళడం మంచిది" అన్నాడు నాగేష్.

"సైకిల్ రాడ్ తగిలి రక్తం వచ్చి వుంటుంది. యాంటీ టిటానస్ ఇంజక్షన్ తీసుకోవడం మంచిది" అన్నాడు పద్మరాజు.

సైకిల్ని వెనక్కు తిప్పి రాజన్ వెళ్ళిపోయాడు.

తన చేతిలో వున్న కాయితాన్ని నాగేష్ పరీక్షగా చూశాడు. అనేకమంది పేర్లు, అడ్రెసులూ వున్నాయి. ప్రతి పేరుకూ కుడివైపున ఇవ్వవలసిన మొత్తం రాయబడివుంది.

"రాజూ, మనకు ఎక్కువ టైములేదు. వాడు తిరిగొచ్చేలోపల మనం పనిముగించాలి" అన్నాడు నాగేష్.

పద్మరాజు సైకిల్ యెక్కాడు. నాగేష్ వెనక కూర్చున్నాడు.

"మొదట రాజానగర్, రెండో వీధికి పద!" అర్చాడు నాగేష్ వెనుకనుంచి.

కాస్సేపట్లో ఒక యింటిముందు సైకిల్ ఆగింది. నాగేష్ దిగి ముందు గుమ్మంవైపు వెళ్ళి తలుపును తట్టాడు.

మధ్య వయస్సులో వున్న ఒక స్త్రీ తలుపు తెర్చింది.

"మనియన్ స్టోర్స్ అమ్మా! రామనాథంగారు వున్నారా?" అడిగాడు నాగేష్.

"మిమ్మల్ని ఆ స్టోర్స్‌లో నేను చూడలేదే!"

అందామె.

"నన్ను మీరు చూడకపోయినా మీరు నాకు బాగా గుర్తున్నారమ్మా."

"ఎంతివ్వాలి?"

"ఇదిగో చూడండి! 780-20" అన్నాడతను.

ఆమె లిస్టువైపు చూసింది. పైన మనియన్ స్టోర్ రబ్బర్ స్టాంపు ముద్రవుంది. ఆమె లోపలకు వెళ్ళింది. డబ్బును అతడికిచ్చింది.

"చూడండి, మేం లిస్టులో రాసిన డెట్ వాషింగ్ సోపులు యివ్వలేదు" అందామె.

"అవునమ్మా! పాకెట్ షాపులో వుంది. ఇటుపక్క వచ్చినపుడు తెచ్చి మీకిస్తాను" అని నాగేష్ పరుగెత్తు కెళ్ళి సైకిల్ వెనుక కూర్చున్నాడు.

పద్మరాజు సైకిల్ని తొక్కుకుపోయాడు.

"నాల్గో రోడ్డుకు పద!" అన్నాడు నాగేష్.

సైకిల్ ఒక ఇంటిముందు ఆగింది. నాగేష్ గుమ్మం వైపు వెళ్ళాడు. ఇంటి యజమాని ధర్మరాజు అతడికెదు రయ్యాడు.

"సార్, మనియన్ స్టోర్స్!" అని వూరుకున్నాడు నాగేష్.

ధర్మరాజు అతడివంక పరీక్షగా చూశాడు.

"నిన్ను నేను ఇంతకుముందు చూడలేదే!" అన్నాడు ధర్మరాజు.

నాగేష్ తీయగా నవ్వాడు.

"నేను షాపులోపల వుంటాను, సార్. మిమ్మల్ని నేను మాశాను. మీ ఇంటికొచ్చే అతను వూరికి వెళ్ళాడు. అతడి తల్లికి అనారోగ్యంగా వుంది. అందుకని నేను

వచ్చాను. ఈ లిస్టు చూస్తే ఎంతివ్వాలో మీకు తెలుస్తుంది" అన్నాడు నాగేష్.

అతడు లిస్టు చూసి లోపలకు వెళ్ళాడు. 650-75 పైసలు తెచ్చి నాగేష్‌కిచ్చాడు. అతడికి థాంక్స్ చెప్పి నాగేష్ వెళ్ళి సైకిల్ వెనక కూర్చున్నాడు.

పద్మరాజు సైకిల్ని పోనిచ్చాడు.

"మరో పెద్ద బిల్లు! పదో రోడ్డుకు పద!"

ఇంటిముందు సైకిల్ ఆగింది. నాగేష్ దిగి తలుపు తట్టాడు. పదహారేళ్ళ యువతి అతడివైపు నవ్వుతూ చూసింది.

"ఇంట్లో యెవ్వరూ లేరు, నేను తప్ప. నాన్న, అమ్మ ఆఫీసులకు వెళ్ళిపోయారు. సాయంత్రం వస్తారు" అందామె.

"మనియాన్ స్టోర్స్ అమ్మా!" అన్నాడు నాగేష్.

"నాన్న డబ్బిచ్చాడు మీకిమ్మని" అని ఆమె లోపలకు పరుగెత్తింది.

పట్టుకొచ్చి అతడికి 550 రూపాయలు యిచ్చింది.

"నాన్న 40 కిలోలు బియ్యం, పది కిలోలు గోధుమలు ఆర్డరిచ్చారు. పొరపాటున మీరు మాకు 40 కిలోల గోధుమలు, 10 కిలోలు బియ్యం ఇచ్చారు. నాన్న ఆ విషయం మీతో చెప్పమన్నారు" అందామె.

"దానికేముందమ్మా! అరగంటలో మరో 30 కిలోల బియ్యం తెచ్చి మీకిస్తాను. యెక్కువగా ఇచ్చిన గోధుమలు తీసుకుపోతాను" అన్నాడు నాగేష్.

ఆమె నవ్వుతూ థాంక్స్ చెప్పింది. నాగేష్ సైకిల్ వైపు పరుగెత్తాడు.

రాజన్ డాక్టర్కి గాయం చూపించాడు. "మరేం

ఫరవాలేదు. బాండెయిడ్ వేస్తే చాలు" అని డాక్టర్ బాండెయిడ్ వేశాడు.

డాక్టర్ గదిలోంచి బయటకొచ్చి రాజన్ తన జేబులోని కాయితంకోసం చూశాడు. కాయితం లేదు! ఎక్కడో పడిపోయి వుంటుంది.

అతడు గాభరాగా మనియన్ స్టోర్స్‌కు సైకిల్ మీద దూసుకు వెళ్ళాడు. ప్రొప్రయిటర్ మనియన్ ముందుకు నడిచాడు.

"సార్, యాక్సిడెంట్ అయింది" అని తన మోకాలు వైపు చూపించాడు.

"ఏమైందిరా? ఏలారీయేనా నీ సైకిల్ని కొట్టిందా?" ప్రశ్నించాడు మనియన్.

"మరో సైకిల్ నా సైకిల్ని కొట్టింది సార్. కింద పడ్డాను. డాక్టర్ దగ్గర కెళ్ళి ఇక్కడికొచ్చాను."

"అంతేనా!"

"సార్, మీరు ఇచ్చిన లిస్టు ఎక్కడో పడిపోయింది" అన్నాడు రాజన్.

"మరో లిస్టు రాసి ఇమ్మని మూర్తితో చెప్పు" అన్నాడు మనియన్.

వెనక వుండే మూర్తివైపు రాజన్ వేగంగా వెళ్ళాడు.

పన్నెండు దాటింది. లిస్టులోని ఆఖరి అడ్రెసుకు పద్మరాజు సైకిల్ని పోనిచ్చాడు.

ఒక యింటిముందు సైకిల్ ఆగింది. నాగేష్ వెళ్ళి తలుపు తట్టాడు.

ఇరవై ఏళ్ళ స్త్రీ తలుపు తెర్చింది. నాగేష్‌వైపు విచిత్రంగా చూసింది.

"మనియన్ స్టోర్స్" అన్నాడతను.

"ఆయనకు జీతం 7 తారీఖున వస్తుంది. యెప్పుడూ మేం 8 తారీఖున ఇస్తున్నాం. ఇవాళ వచ్చేరేమిటి?" అందామె.

"అది మాకు తెలుసమ్మా. మా ప్రొప్రయిటర్ ఇంట్లో యెల్లుండి పెళ్ళుంది. ఇవ్వగలిగింది పట్రామన్నారు" అన్నాడు నాగేష్.

"ఎంతివ్వాలి?" అందామె.

"450" అన్నాడతను.

"పెళ్ళి వుందని చెప్పడంవలన నా డబ్బులోంచి మీకిచ్చేస్తాను" అందామె.

మా ప్రొప్రయిటర్ చాలా ఆనందిస్తారు."

ఆమె లోపలకు వెళ్ళి డబ్బు తెచ్చి యిచ్చింది.

"మీకు చాలా థాంక్సమ్మా. మీరు పెళ్ళికి తప్పక రావాలి. ఇవాళే మీకు ఇన్విటేషన్ పోస్టుచేశాం. సాయంత్రం లోపల మీకు అందుతుంది" అన్నాడు నాగేష్.

"నేనూ, ఆయన తప్పక వస్తాం" అందామె.

నాగేష్ సైకిల్ వెనక కూర్చున్నాడు. పద్మరాజు సైకిల్ని పోనిస్తున్నాడు.

"ఎక్కడికి పోదాం?" పద్మరాజు అడిగాడు.

"ఈ అద్దె సైకిల్ ఇచ్చేసి బెంగుళూరు పోదాం. కొన్ని రోజులపాటు ఈ ప్రాంతంలో మనం ఎవ్వరికీ కనబడకూడదు" అన్నాడు నాగేష్.

"గుడ్ ఐడియా!" అన్నాడు పద్మరాజు.

"డబ్బు బరువుతో నేను చస్తున్నాను. తొందరగా పద!" అన్నాడు నాగేష్.

3

బెంగుళూరు!

హోటలు గదిలోని ఫ్లోరసెంట్ లైటు ప్రకాశవంతంగా వెలుగుతోంది.

నాగేష్ సోఫాలో కూర్చున్నాడు. రెండు గ్లాసుల్లో పీటర్ స్కాట్ విస్కీ పోసి, ఐస్ క్యూబ్స్ పడేసి, కొద్దిగా కూల్ వాటర్ పోశాడు పద్మరాజు.

ఇద్దరూ గ్లాసులను అందుకున్నారు. నాగేష్ నవ్వుతూ పద్మరాజు వైపు చూశాడు.

"రాజూ, మన జీవితం మారిపోయింది! మనం ధనవంతులం" అన్నాడు నాగేష్.

"ఫైన్" అన్నాడు పద్మరాజు.

"రాజూ, నాలుగ్గంటలు తిరిగి మనియన్ స్టోర్స్ తరఫున మనం ఇరవై ఐదు వేలు కలెక్టు చేశాం. బ్రహ్మాండమైన మొత్తం. అందులోంచి నీకు 2,500 ఇస్తాను. నేను 2,500 తీసుకుంటాను. ఇరవై వేలు మన కార్యక్రమాలకు కాపిటల్‌గా వుంచుకుందాం" అన్నాడు నాగేష్.

"నువ్వు చెప్పిందే నాకు వేదం" అన్నాడు పద్మరాజు.

"మనం చేసింది చాలా చిన్నది. ఇంకా పెద్ద పెట్టున మనం డబ్బు సంపాదించాలి. మన కాపిటల్ ఇరవై వేలు అందుకోసం మనకు చాలా వుపయోగపడుతుంది."

"నాగేష్, యూ ఆర్ జీనియస్! ఇంతవరకూ చిన్న దొంగతనాలతో నేను తృప్తిపడేవాడిని. నీతో చెయ్యి కలిపాక పెద్ద పెట్టున యెలా చెయ్యాలో నేను నేర్చుకున్నాను."

గ్లాసులోని విస్కీని నాగేష్ గడగడ తాగేశాడు.

"రాజా, త్వరలో లక్షలు, కాదు కోట్లు, మన చేతిలోకొస్తాయి!"

"నీ మాటల్లో నాకు నమ్మకముంది."

గ్లాసులు ఖాళీ అయ్యాయి. మళ్ళీ గ్లాసుల్లో పద్మరాజు విస్కీ పోశాడు. ఐస్ క్యూబ్స్ వేశాడు. నీళ్ళు కలిపాడు.

"మై డియర్ రాజూ, మనం యెంతేనా తాగొచ్చు. ఎంతైనా ఖర్చు పెట్టొచ్చు!"

ఎవరో తలుపును తట్టారు. పద్మరాజు వులిక్కిపడ్డాడు.

"భయపడకు! వెళ్ళి, తలుపు తెర్చిచూడు!"

పద్మరాజు తలుపు తెర్చాడు. బయట హోటల్ బేరర్ నిలబడి వున్నాడు.

"డిన్నర్, సార్" అన్నాడు బేరర్.

పద్మరాజు వెనక్కి తిరిగి నాగేష్ వైపు చూశాడు.

"గదికి పట్రమను" అన్నాడు నాగేష్.

బేరర్ వెళ్ళిపోయాడు. తలుపు మూసి పద్మరాజు తన గ్లాసును అందుకున్నాడు వుషారుగా.

నాగేష్ టైమ్ చూశాడు. పది దాటింది.

"నాగేష్, మనియన్ స్టోర్స్ యజమాని వూరుకుంటాడా? ఈపాటికి పోలీసు రిపోర్టు ఇచ్చి వుంటాడు" అన్నాడు పద్మరాజు.

"పోలీసులు ఏం చేస్తారు? డబ్బిచ్చినవాళ్ళు నా రూపం గురించి చిత్రిస్తారు. పోలీసులు నాకోసం వెతుకుతారు. మనం బెంగుళూరులో వున్నాం. ఎంత వెతికినా మద్రాసులో మనం దొరకం. కొంతకాలమయ్యాక పోలీసులు మన్ని గురించి మర్చిపోతారు."

"మనియన్ స్టోర్స్ యజమాని అంత నష్టం భరించ

గలదా?"

"భరించవలసిందే. డబ్బిచ్చినవాళ్ళను మళ్ళా డబ్బు ఇవ్వమనలేదు. కంపెనీ రబ్బరు స్టాంపున్న లిస్టుచూసి డబ్బిచ్చామని వాళ్ళంటారు. ఆ స్టోర్సు చాలా పెద్దది. దాని ప్రొప్రయిటర్ లక్షలు గడించాడు. ఇరవై ఐదువేలు అతడికి నతింగ్!" అన్నాడు నాగేష్.

"సైకిల్ యాక్సిడెంట్‌నుబట్టి వాళ్ళు మన్ని అనుమానిస్తారేమో!" అన్నాడు పద్మరాజు.

నాగేష్ గంభీరంగా నవ్వాడు.

"రాజూ, మనం ఎవరో ఎవరికీ తెలియదు. మన్ని అనేకమంది చూశారు. మన్ని వర్ణిస్తారు. కాని అది అంతగా వుపయోగపడదు. ఒక నెలపాటు మనం ఇక్కడే వుందాం. ఎవ్వరూ మన్ని కనుక్కోలేరు" అన్నాడు నాగేష్.

"నాగేష్, సహజంగా నాకు భయం ఎక్కువ. కాని నీ పక్కనుంటే నాకు ధైర్యంగా వుంది" అన్నాడు పద్మరాజు.

4

మర్నాడు రాజన్ లిస్టులో రాసిన ఇళ్ళకు వెళ్ళి బోడి చేతులతో తిరిగి వచ్చాడు.

ప్రొప్రయిటర్ అతడివైపు కోపంగా చూశాడు.

"ఏమిట్రా నువ్వనేది? నేను ఎవ్వర్నీ పంపలేదు!" అరిచాడు మనియన్.

"ఎవరో వెళ్ళి డబ్బు వసూలు చేశారు సార్" అన్నాడు రాజన్.

ప్రొప్రయిటర్ మనియన్ గుండె దడదడ కొట్టుకుంది. లిస్టు ప్రకారం 25 వేలు తనకు రావాలి. అదంతా ఎవరో

పట్టుకుపోయారా?

"ఎవరో ఇంటికొచ్చి మనియన్ స్టోర్స్ పేరు చెప్పగానే డబ్బివ్వడం మూర్ఖత్వం. ఆ నష్టం వాళ్ళే భరించాలి" అన్నాడు మనియన్.

"సార్, రబ్బర్ స్టాంపు ముద్ర వేసిన లిస్టు చూసి వాళ్ళు డబ్బు చెల్లించారు" అన్నాడు రాజన్.

"ఎలా వచ్చింది లిస్టు వాళ్ళకు?"

"నిన్న సైకిల్ మీదనుంచి పడిపోయానుగా, అప్పుడు నా జేబులో వున్న కాగితం ఎక్కడో జారిపోయిందని మీతో చెప్పాను. ఆ లిస్టు ఎవరికో దొరికివుంటుంది!"

ఇప్పుడు మనియన్ గాభరాపడసాగాడు. ఖాతాదార్లను మళ్ళా డబ్బియమని తను అడగలేడు. అడిగితే ఇటుపైన ఎవ్వరూ తన దగ్గర కొనరు. స్టోర్స్ మూసేయవలసి వస్తుంది.

మనియన్ కుర్చీలోంచి లేచాడు. "నాతో రా" అన్నాడు రాజన్‌తో.

మనియన్ బయటకొచ్చి స్కూటర్ని స్టార్టుచేసి సీటుమీద కూర్చున్నాడు. స్కూటర్ స్పీడుగా వెళ్ళిపోయింది.

ఇన్‌స్పెక్టర్ రామన్‌కి అంతా వివరంగా చెప్పి, రిపోర్టు రాసిచ్చాడు మనియన్.

"మేం దర్యాప్తు చేస్తాం. వాళ్ళు ఇక్కడి వాళ్ళే అయివుండాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అదే సమయంలో నాగేష్, పద్మరాజు చల్లటి బీర్ తాగుతున్నారు.

నాగేష్ బీర్ తాగుతూ ఏదో ఇంగ్లీషు పత్రికను చదువుతున్నాడు. రెండుమూడుసార్లు పత్రికను చదివి

అతడు పద్మరాజువైపు చూశాడు.

"రాజూ, ఈసారి మనం చేయబోయేది మన్ని కోటీశ్వరులుగా మారుస్తుంది!" అన్నాడు నాగేష్.

పద్మరాజు ఆశ్చర్యంగా నాగేష్‌వైపు చూశాడు. పత్రికలో ముద్రించిన ఫోటోను నాగేష్ తన మిత్రుడికి చూపించాడు.

"ఎవరామె?" అడిగాడు పద్మరాజు.

"ఈమె పేరు కమల. ఈమె తండ్రి కోటీశ్వరుడు రుద్రప్ప. బెంగుళూరులో పేరుపొందిన బిజినెస్‌మన్, పారిశ్రామికవేత్త. ఆయన యిల్లు రాజభవనంలా వుంటుంది."

"నాగేష్ ఏమిటి నీ ప్లాన్? ఆయనకు అల్లుడవ్వాలని ఆశపడుతున్నావా?"

"అది ప్రస్తుతం సాధ్యంకాదు. ఆమె మరణించి 18 ఏళ్ళు అయింది."

"పూర్ గర్ల్, కన్యగానే మరణించిందన్నమాట!" అర్చాడు పద్మరాజు, గ్లాసులో బీర్ పోసుకుంటూ.

కొంతసేపు హోటల్ గదిలో నిశ్శబ్దంగా వుంది. గ్లాసులోని బీరు తాగి, నాగేష్ సిగరెట్ వెలిగించాడు. ఎదురుగా కూర్చున్న పద్మరాజువంక అతడు సూటిగా చూశాడు.

"మనకు పద్దెనిమిదేళ్ళ యువతి కావాలి!"

"ఎందుకు?" అడిగాడు పద్మరాజు.

"ఆమె అచ్చంగా కమలలా వుండాలి!" అన్నాడు నాగేష్.

"నువ్వు ఏం చేయదల్చావో తెలియడంలేదు" అన్నాడు పద్మరాజు.

"రాజూ, రుద్రప్పకి తన కూతురంటే చాలా ప్రేమ. ప్లేను యాక్సిడెంట్‌లో మరణించిన కూతుర్ని గురించి ఆలోచిస్తూ అతడు జీవిస్తున్నాడు. అతడి ఆస్తికి వారసులు లేరు."

"ఇంతకీ నీ ప్లాను ఏమిటో చెప్పు!"

"రుద్రప్ప ఆస్తిలో కొంతభాగమైనా మన చేతుల్లోకి రావాలి!" అన్నాడు నాగేష్.

"అందుకోసం మనం ఏం చేద్దాం?"

"అదింకా నేను ఆలోచించాలి. ఈ పత్రిక చదివాక నాకేదో ఐడియా వచ్చింది. బాగా ఆలోచించి, మరి కొన్ని విషయాలు తెలుసుకుని, మనం రంగంలోకి దిగాలి" అన్నాడు నాగేష్.

5

ఇందిరా అనాధాశ్రమంలోంచి బయటకు వచ్చి ఆమె రోడ్డమ్మట నడుస్తోంది.

సమీపంలో నిలబడిన నాగేష్ గట్టిగా పక్కనున్న పద్మరాజు చెయ్యి పట్టుకున్నాడు.

"రాజూ, పదిరోజులనుంచి ఆమెను గమనిస్తున్నాను. జాగ్రత్తగా చూడు! ఆమె యెలా వుందో చెప్పు!" అన్నాడు నాగేష్.

ఆమెను పరీక్షగా చూశాడు పద్మరాజు. ఆమె అందంగా వుంది. మామూలు కాటన్ చీర, జాకెట్ ధరించింది. కాని ముఖంలో బ్రహ్మాండమైన కళ వుంది.

"మనం పత్రికలో చూసిన కమలలాగే వుంది" అన్నాడు పద్మరాజు.

నాగేష్ మిత్రుని చెయ్యి వదిలేశాడు. "నువ్వు వెనక దూరంగా రా. నేను వెళ్ళి ఆమెతో మాట్లాడతాను"

అన్నాడు నాగేష్.

నాగేష్ గబగబా ఆమెవైపు వెళ్ళాడు. పక్కనే నడుస్తూ ఆమెవైపు ఓరగా చూశాడు.

"మిస్, నీతో మాట్లాడాలి" అన్నాడతను.

ఆమె అతడివంక తిరిగి నవ్వుతూ చూసింది.

"నాతోనా? ఎవరు మీరు?" అందామె తీయటి కంఠంతో.

"పేరు నాగేష్" అన్నాడతను.

"నా పేరు కమల" అందామె.

అతడు తృప్తిపడ్డాడు. రుద్రప్ప కూతురు పేరు కమలే!

"మిస్, మనం ఎక్కడో కూర్చుని కాసేపు మాట్లాడాలి."

ఆమె నవ్వింది.

"ఇలా నడుస్తూ మాట్లాడలేరా?" అడిగిందామె.

"మాట్లాడొచ్చు."

"అయితే చెప్పండి!"

"ఒక పని నేను నీకు కల్పిస్తాను. అది చేస్తే నీకు ఐదువేలు ఇస్తాను."

ఆమె ఆశ్చర్యంగా అతడివైపు చూసింది.

"ఏమిటా పని?"

"అది తర్వాత చెప్తాను. నాతో పనిచేయడానికి నువ్వు అంగీకరించాలి."

ఆమె జవాబివ్వలేదు. పక్కపక్కనే ఇద్దరూ నడుస్తున్నారు.

"నువ్వు అనాథాశ్రమంలో వుంటున్నావా?"

"అక్కడ వుండడానికి ప్రయత్నిస్తున్నాను. కాని

ఇంకా ఆ అదృష్టం లేదు నాకు."

"నీ కెవ్వరూ లేరా?"

"లేరు. ఒంటరిదాన్ని. దయతలచి ఒక యువతి నన్ను తన హాస్టల్ గదిలో వుండనిస్తోంది. కాని ఎక్కువకాలం అక్కడ వుండలేను. ఎక్కడకేనా మారాలి" అందామె.

"నీ పరిస్థితిలో ఈ ఐదువేలూ చాలా ఉపయోగపడతాయి" అన్నాడతను.

"డబ్బు ఎప్పుడూ వుపయోగపడుతుంది" అందామె.

ఇద్దరూ ముందుకు నడిచారు. నాగేష్ ఆగాడు.

"ఇవాళ సాయంత్రం, నా హోటల్ గదికి రా—అక్కడంతా చెప్తాను" అని హోటల్ పేరు, గది నంబరు చెప్పాడతను.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"గదికొచ్చాక పిచ్చి చేష్టలు చేస్తే నేనూరుకోను" అందామె.

"అటువంటి వుద్దేశం నాకు లేదు."

"అయితే వస్తాను" అని ఆమె వెళ్ళిపోయింది.

నాగేష్ నిలబడి ఆమెవైపే చూస్తున్నాడు.

ఆమె నడుస్తూ తన జీవితాన్ని గురించి ఆలోచించసాగింది. ఆమె తండ్రి మళ్ళా పెళ్ళిచేసుకున్నాడు. ఇంట్లో సవితల్లి పెట్టేబాధలు భరించలేక ఆమె బెంగుళూరు వచ్చేసింది. ట్రెయిన్‌లో ఆమెకు సుభతో పరిచయమైంది. సుభతో కాలేజి హాస్టల్లో ఆమె తాత్కాలికంగా వుంటోంది. కాని రెండుమూడు రోజుల్లో ఆమె ఎక్కడో నివాసం చూసుకోవాలి!

పద్మరాజు మెల్లిగా నాగేష్ దగ్గరకు వచ్చాడు.

"నాగేష్, ఏమైంది?"

"సాయంత్రం మన గదికి వస్తుంది. వచ్చాక వివరంగా మాట్లాడాలి" అన్నాడు నాగేష్.

6

తలుపు తట్టగానే నాగేష్ గబగబా వెళ్ళి తెరిచాడు. ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"కమిన్!" అన్నాడతను.

ఆమె లోపలకొచ్చింది. తలుపు మూసి నాగేష్ ఆమె వైపు చూశాడు.

"మిస్ కమలా, కూర్చో!"

ఆమె కుర్చీలో కూర్చుంది. పక్క కుర్చీలో కూర్చున్న పద్మరాజువైపు చూసింది.

"అతడు నా పార్ట్నర్. పేరు పద్మరాజు" అన్నాడు నాగేష్.

"ఐయామ్ కమల" అందామె.

"మిస్ కమలా, కాఫీ తీసుకుంటావా?"

"స్ట్రాంగ్ కాఫీ అంటే నాకిష్టం" అందామె.

నాగేష్ పద్మరాజుకు సౌజ్ఞ చేశాడు. ఫ్లాస్కులోని కాఫీని కప్పులో పోసి ఆమెముందు టీపాయిమీద పెట్టాడు పద్మరాజు.

"మీకో?" అందామె, ఇద్దరివైపు చూస్తూ.

"మాకు కాఫీ చాలదు! విస్కీ కావాలి" అన్నాడు నాగేష్ నవ్వుతూ.

మెల్లిగా ఆమె కాఫీ తాగింది.

"మిస్ కమలా, ఈ పట్నంలో రుద్రప్ప పేరుపొందిన బిజినెస్‌మన్. పద్దెనిమిదేళ్ళ క్రితం ఆయన కూతురు కమల ప్లేన్ ప్రమాదంలో మరణించింది. నువ్వు ఆయన కూతురవ్వాలి!" అన్నాడు నాగేష్.

ఆమె పరిహాసంగా నవ్వింది.

"అదెలా అవుతుంది?"

"నా ప్లాను ప్రకారం అవుతుంది. నిన్ను ఆయన కూతురుగా స్వీకరించగానే నీకు ఐదువేలు యిస్తాను. అటుపైన మరికొంత పని నువ్వు చెయ్యాలి. దానికి వేరే డబ్బిస్తాం."

ఆమె ఇద్దరివైపూ చూసింది.

"మీ వుద్దేశం ఏమిటి? ఆయన్ని మోసగించి డబ్బును గుంజాలని ఆశిస్తున్నారా?" అడిగిందామె.

"మాకు కావలసిన మొదటి పని గురించి చెప్పాను. తర్వాత విషయాలు అటుపైన నీకు తెలుస్తాయి" అన్నాడు నాగేష్.

ఆమె మాట్లాడలేదు. ఆలోచిస్తూ వుండిపోయింది.

"నువ్వు ఒప్పుకుంటే మేం పని ప్రారంభిస్తాం. నీకు మంచి చీరలు, నగలు కొనాలి. నీ రూపం కొద్దిగా మార్చాలి."

"ఎవర్నీ మోసగించవలసిన పని నాకు ఉండదని హామీ ఇస్తే సరే అంటాను."

"నువ్వు మోసగించవు!" అన్నాడు నాగేష్.

"అయితే మీరు చెప్పింది చేస్తాను" అందామె.

"గుడ్" అని నాగేష్ సిగరెట్ వెలిగించాడు.

పొగవదుల్తూ నాగేష్ ఆమెవంక చూశాడు.

"మిస్ కమలా, ఇదే హోటల్లో నీ పేర ఒక గది మేం తీసుకుంటాం. నువ్వు ఆ గదిలో వుండొచ్చు. ప్రస్తుతం నువ్వుండే హాస్టల్ గదిలో నీ సామానులు ఏమైనా వున్నాయా?"

"ఒక ఏర్ బాగ్ మాత్రం వుంది."

"నువ్వు వెంటనే ఆటోరిక్షాలో వెళ్ళి అది తెచ్చుకో. నువ్వు తిరిగి వచ్చేసరికి గది రెడీగా వుంటుంది" అన్నాడు నాగేష్.

ఆమె కుర్చీలోంచి లేచింది. నాగేష్ ఐదువందలు ఇచ్చాడు. మరో యాభై రూపాయలు వేరే ఇచ్చాడు.

"500 నీకు అడ్వాన్స్‌గా ఇచ్చాను. ఆ యాభై ఆటో, టాక్సీల్లో వెళ్ళడానికి వుంచుకో" అన్నాడు నాగేష్.

ఆమె చిన్న పర్స్‌ను జాకెట్ లోంచి పైకితీసి డబ్బును అందులో దాచుకుంది.

"వెళ్ళి వస్తాను" అందామె.

ఆమెవైపు నాగేష్ నవ్వుతూ చూశాడు.

"తొందరగా వచ్చెయి. మనం చేయవలసిన పని చాలా వుంది" అన్నాడతను.

"రాజూ, లెటస్ డ్రింక్ విస్కీ ఫర్ సక్సస్!" అన్నాడు నాగేష్ వుషారుగా.

7

కారులోంచి దిగి పక్కనున్న సిమెంట్ సోఫాలో కూర్చున్నాడు రామచంద్రమూర్తి.

అతడి వయస్సు అరవై పైన వుంటుంది. రామచంద్ర మూర్తి ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, రుద్రప్పకు పెర్సనల్ సెక్రటరీ. అతడిది పెద్ద కుటుంబం. ముగ్గురు కూతుళ్ళకు పెళ్ళయిపోయింది. ముగ్గురు కొడుకులు విదేశాల్లో వుద్యోగాలు చేస్తున్నారు. ఇంట్లో భార్య కీళ్ళ నొప్పులతో మంచం పట్టింది.

అతడి ముందునుంచి ఒక యువతి వయ్యారంగా నడిచి వెళ్తోంది. ఆమెవైపు చూసి అతడు ఠృళ్ళిపడ్డాడు.

ఆమె చేతి రుమాలు కిందపడింది. వంగి ఆమె దాన్ని తీసుకుంటూంటే రామచంద్రమూర్తి ఆమె ముఖంకేసి పరీక్షగా చూశాడు.

అతడి గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆమె తోటలో నడుస్తూ వెళ్ళిపోయింది.

నాగేష్, పద్మరాజు మొక్కల వెనుక నుంచి రామ చంద్రమూర్తిని గమనిస్తున్నారు.

అతడి చూపు ఆమె మీదే వుంది. లాల్ బాగ్ గార్డెన్స్‌లో కొంతదూరం వెళ్ళి ఆమె వెనక్కు తిరిగింది.

మళ్ళా అతడి ముందునుంచి వెళ్తోంది.

ఈసారి అతడు ఆగలేకపోయాడు. సోఫాలోంచి చటుక్కున లేచి ఆమెవైపు నడిచాడు.

"అమ్మాయి!" పిల్చాడు.

వెనుదిరిగి అతడివైపు చూసిందామె.

"ఎవరు నన్ను పిల్చారు?" అందామె.

"నే నేనమ్మా."

ఆమె తీయగా నవ్వింది.

"నీ పేరు?"

"కమల" అందామె.

క్షణకాలం అతడు మౌనంగా వుండిపోయాడు. అదే పేరు! రుద్రప్ప కూతురు కమలకూ, ఈమెకూ యెంత పోలిక!

రుద్రప్ప కూతురు కమల అతడికి బాగా జ్ఞాపకముంది. పదెనిమిదేళ్ళు గడిచిపోయినా కమలను అతడు మరువ లేదు.

"ఏమిటలా చూస్తున్నారు?" అడిగిందామె.

"నువ్వు ఈ గార్డెన్స్‌కు రోజూ వస్తూ వుంటావా?"

"సాయంత్రం వస్తూ వుంటాను."

"అమ్మాయి, నీది ఏ వూరు?"

"వైజాగ్" అందామె క్లుప్తంగా.

"ఇన్ని ప్రశ్నలు వేసినందుకు నన్ను క్షమించు తల్లీ."

"ఫరవాలేదులెండి" అని ఆమె వెళ్ళిపోయింది.

రామచంద్రమూర్తి ఆలోచిస్తూ కార్లో కూర్చున్నాడు. సైపు వెలిగించాడు.

గతంలోంచి ఒక దృశ్యం అతడికి గుర్తుకొచ్చింది.

పదెనిమిదేళ్ళ క్రితం! కమల బొంబాయినుంచి ప్లేనులో వస్తోంది. తను కారులో ఏరోడ్రోముకు వెళ్ళాడు. ఎంతకీ ప్లేను రాలేదు. ఆ ప్లేన్ నేల కూలిపోయిందనే విషాద వార్త అతడికి అందింది.

అనేక శవాలను మరో ప్లేనులో మద్రాస్‌కు తీసుకొచ్చారు. కమల శవాన్ని అతనే కారులో యింటికి తీసుకెళ్ళాడు.

భయంకరంగా వున్న కూతురు శవాన్ని చూసి రుద్రప్ప స్పృహతప్పి పడిపోయాడు.

చలనం లేకుండా కారులో కూర్చుని వున్న అతడి వైపు నాగేష్, పద్మరాజు చూశారు.

కాసేపట్లో కారు కదిలింది. నాగేష్ వుషారుగా పద్మరాజు చెయ్యి పట్టుకున్నాడు.

"బంతి ఇప్పుడు వాళ్ళ కోర్టులో వుంది. ఏం జరుగుతుందో చూద్దాం" అన్నాడు నాగేష్.

వాళ్ళిద్దరూ యెక్కాక టాక్సీ కదిలింది.

8

రుద్రప్ప పెద్ద సోఫాలో కూర్చున్నాడు. నుదురుమీద విభూది. అతడు ధరించిన పంచ, జుబ్బా తెల్లగా మెరు

స్తున్నాయి.

65 ఏళ్ళ వయస్సువు రుద్రప్ప దారుఢ్యంగానే వున్నాడు. ఒకప్పుడు పేరుకు తగ్గట్లు అతడికి కోపం ఎక్కువ. కాని భార్య మరణం, తర్వాత కూతురి చావు అతడి కోపాన్ని హరించేశాయి.

రామచంద్రమూర్తి వినయంగా అతడిముందుకు నడిచి నమస్కరించాడు.

"రామూ, ఎలా వున్నావు?"

"అరవై ఏళ్ళ తర్వాత జీవితం ఓవర్ డ్రాఫ్ట్ మీద బ్రతకడం లాంటిది" అన్నాడు రామచంద్రమూర్తి నవ్వుతూ.

"యూ ఆర్ రైట్! 60 ఏళ్ళు బ్రతికితేగాని ఓవర్ డ్రాఫ్ట్ అడిగే అర్హత మనిషికి రాదు!" అన్నాడు రుద్రప్ప.

కొంతసేపు ఇద్దరూ మౌనంగా వున్నారు.

"నిన్న సాయంత్రం విచిత్రమైన సంఘటన జరిగింది. మీతో చెప్పాలి."

రుద్రప్ప అతడివైపు సూటిగా చూశాడు.

"ప్రతిరోజూ నేను లాల్ బాగ్ గార్డెన్స్ కు వెళ్ళి కాసేపు కూర్చుంటాను. అది మీకు తెలిసిందే."

రుద్రప్ప తలాడించాడు.

"ఒక యువతిని చూశాను, ఆమె వైజాగ్ నుంచి వచ్చింది. గార్డెన్స్ లో తిరుగుతూంటే ఆమెను చూశాను. ఎంత పోలిక! ఆమెను చూస్తూంటే మన కమల తిరిగి వచ్చిందేమో అనిపించింది. ఆమె పేరు కూడా కమలే!

"ఆమెను నాకు చూపించలేదు!"

"చూపించాలనే వుద్దేశంతో ఇదంతా చెప్తున్నాను

ఇవాళ సాయంత్రం మీరూ రండి. ఆమె అక్కడ నడుస్తూ వుంటుంది."

రుద్రప్ప వెనక్కి తిరిగాడు. గోడమీదున్న కమల ఫోటోవైపు ఆప్యాయంగా చూశాడు. కొంతసేపయ్యాక సెక్రటరీవైపు తిరిగాడు.

"ఆమెను చూడ్డానికి నేను రావాలా? ఆమెతో మాట్లాడు. నా పేరు చెప్పు. నా పేరు ఆమె వినే వుంటుంది. ఇవాళ రాత్రి ఆమెను ఇక్కడకు డిన్నర్‌కు రమ్మను. ఆమె అడ్రెసు తెలుసుకుని కారులో వెళ్ళి ఆమెను తీసుకురా."

"అలాగే చేస్తాను, సార్."

"రామూ, ఆత్మకు చావులేదు. అనేక రకాల అనుభవాలకోసం ఆత్మ మళ్ళా ఈ భూమ్మీద జన్మిస్తూనే వుంటుంది. నువ్వు చెప్పింది విన్నాక నా మనస్సు ఆమె మీదే వుంది. కమలను చూడాలి!" అన్నాడు రుద్రప్ప.

అద్దంముందు నిలబడి సాయంత్రం ఆమె ముఖానికి వానిషింగ్ క్రీమ్ రాసుకుంటోంది.

పద్మరాజు సోఫాలో కూర్చుని ఆమెవైపే చూస్తున్నాడు.

"కమలా, ఈ డ్రెస్‌లో నువ్వు చాలా అందంగా వున్నావు!" అన్నాడతను.

"మీ పార్ట్నర్‌లా మీ చూపు కూడా బిజినెస్ మీదే కేంద్రీకృతమై వుంటుందని పొరబడ్డాను. ఒక యువతి అందచందాలు చూసే ఆసక్తి మీకున్నందుకు సంతోషం". అందామె.

ముస్తాబయి ఆమె వచ్చి అతడి పక్కనే కుర్చీలో కూర్చుంది. పద్మరాజు ఆమె కళ్ళలోకి ఆప్యాయంగా

చూశాడు.

"విధి మనిద్దర్నీ బెంగుళూరు చేర్చి కలిపింది. ఎందుకోఃి?" అన్నాడతను.

"విధి మానవ జీవితాలతో ఆడుకుంటుంది" అందామె.

తలుపు తోసుకుని నాగేష్ లోపలకొచ్చాడు.

"మిస్ కమలా, ఇవాళ గార్డెన్స్‌లో ఆ ముసలాడు ఒంటరిగా వుంటాడు. మరో ముసలాడు రుద్రప్ప వాడి పక్కనుంటాడు. రుద్రప్ప నిన్ను చూసి పిచ్చివాడవ్వాలి. అమ్మా, కమలా అని నిన్ను పిలవాలి" అన్నాడు నాగేష్.

"నా ప్రయత్నంలో లోపముండదు" అందామె నవ్వుతూ.

9

కారు పక్కనే నిలబడి వున్నాడు రామచంద్రమూర్తి. అరగంట గడిచినా ఆమె రాలేదు. ఇవాళ రాదేమో!

దూరంలో ఆమె రూపం కనిపించింది. ఆమె మెల్లిగా నడుస్తోంది.

చెట్టు పక్కనుంచి నాగేష్, పద్మరాజు కారుపక్కనున్న రామచంద్రమూర్తివైపు చూశారు.

"నా ప్లాన్ మిస్‌ఫైర్ అయినట్లుంది. రుద్రప్ప ఎక్కడా పత్తాలేదు!" అన్నాడు నాగేష్.

కారు పక్కనుంచి వెళ్తూ ఆమె ఆగింది.

"నీకోసమే చూస్తున్నానమ్మా" అన్నాడతను.

"నాకోసం చాలాసేపు వేచివుంటే క్షమించండి" అందామె.

"చాలా సంస్కారం వున్న యువతి అనుకున్నాడు

రామచంద్రమూర్తి.

"నీతో నేనూ నడుస్తాను. నడుస్తూ మాట్లాడుదాం."

ఇద్దరూ పక్క-పక్కనే నడవసాగారు.

"అమ్మాయి, నా మిత్రుడొకడు వున్నాడు. అతడి కొక్కతే కూతురు. ఆమె మరణించింది. ఆమెను గురించి ఆలోచిస్తూ, అతడు కృశించిపోతున్నాడు. అతడి కూతురు అచ్చంగా నీలాగే వుంటుంది. నిన్ను ఒకసారి చూస్తే అతడి బాధ కొంత తగ్గుతుందని నా నమ్మకం" అన్నాడతను.

అటువంటి వ్యక్తిని ఆనందపర్చడానికి నేను ఏదైనా చేస్తాను" అందామె.

"బాగా అన్నావు అమ్మాయి. రుద్రప్పగారి పేరు విన్నావా?"

"ఎవరాయన?"

రుద్రప్ప పేరు ఆమె వినలేదని రామచంద్రమూర్తి అనుకున్నాడు. రుద్రప్ప పేరు విననట్లు నటించమని నాగేష్ ఆమెకు చెప్పాడు.

"ఆయన కోటీశ్వరులు. ఆయనకు ఎన్నో ఫాక్టరీలు వున్నాయి. నిజం చెప్పాలంటే నే నాయన సెక్రటరీని. ఆయన కూతురే మరణించింది. అది జరిగి చాలా కాల మైంది. ఇవాళ రాత్రి ఆయన నిన్ను డిన్నర్ కి రమ్మన్నారు. నేను కారులో వచ్చి నిన్ను తీసుకెళ్తాను."

"తప్పక వస్తాను" అందామె.

"నేనొచ్చి తీసుకెళ్తాను."

"నేను ఎక్కడకు రావాలి?"

"హోటల్ ఇగ్లూ, రూమ్ నెంబర్ 50" అందామె.

ఇద్దరూ మరికొంత దూరం నడిచి వెనక్కి తిరిగారు.

"అమ్మాయి, ఆయన నాకంటె పెద్దవారు. ప్రేమ మూర్తి. ఆయన నిన్ను చూసి చాలా ఆనందిస్తారు."

"రాత్రి ఎనిమిదింటికి రండి" అందామె.

అతడు తన కారు దగ్గర ఆగిపోయాడు. ఆమె మెల్లిగా వెళ్ళిపోయింది.

టాక్సీకి కొంత దూరంలో నాగేష్, పద్మరాజు ఆమెను కలుసుకున్నారు.

"నేను నీకు చెప్పినట్లు కాలేదు" అన్నాడు నాగేష్.

ఆమె తీయగా నవ్వింది.

"రుద్రప్పగారు రాకపోయినా మీ ప్లాన్ ప్రకారం అంతా సాగుతోంది. ఇవాళ రాత్రి ఎనిమిదింటికి రామచంద్రమూర్తి హోటల్ కి వచ్చి నన్ను తీసుకెళ్తాడు. రుద్రప్పగారి ఇంట్లో నాకు డిన్నర్!" అందామె.

నాగేష్ సంతోషంగా సిగరెట్ వెలిగించాడు.

"ఇక్కడికొస్తే అందరూ చూస్తారని భయపడి రుద్రప్ప ఇంట్లోనే వుండివుంటాడు. ఏది ఏమైనా మనం నెగ్గుతున్నాం" అన్నాడు నాగేష్.

ముగ్గురూ టాక్సీవైపు నడిచారు. లోపల కూర్చుని తలుపులు మూశారు. టాక్సీ కదిలింది.

హోటల్ ఇగ్లూ కాంపౌండులో టాక్సీ ఆగింది. కమల దిగి తన గదికి వెళ్ళిపోయింది. నాగేష్, పద్మరాజు వాళ్ళ గదికి వెళ్ళారు.

"నాగేష్ టైము చూశాడు. ఏడు ఇంకా కాలేదు.

"రాజూ, విస్కీ!"

రెండు గ్లాసుల్లో పద్మరాజు విస్కీ పోసి, ఐస్ క్యూబ్స్ పడేసి కొద్దిగా నీళ్ళు పోశాడు.

"మన ప్లాను ఫలిస్తోంది, చియర్స్!" అన్నాడు నాగేష్.

10

పోర్టికోలో మెర్సిడిస్ కారు ఆగింది. డ్రయివర్ దిగి తలుపు తెర్చాడు. రామచంద్రమూర్తి, కమల కిందకు దిగారు.

"వెల్ కమ్!" అన్నాడు రామచంద్రమూర్తి.

అతడి వెనకనే ఆమె వెళ్ళింది. పెద్ద హాలు. హాలులో పది సోఫాలు. ఒక సోఫాలో రుద్రప్ప కూర్చునివున్నాడు.

వెనకనే గోడమీద అమర్చబడి వుంది కమల లైఫ్ సైజు పెయింటింగ్. హాల్లోని లైట్లు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి.

కమల నవ్వుతూ రుద్రప్ప ముందుకు వెళ్ళింది. అతడామెవైపు చూస్తున్నాడు. కళ్ళు, చేతులు, కాళ్ళు, ఆమెకు రూపాన్నిచ్చే అన్ని అవయవాలనూ అతడు గమనిస్తున్నాడు.

ఆమె తీయగా నవ్వుతోంది. కనురెప్పలు చిట్లిస్తోంది. గతం తెరలు చించుకుని కమల తనముందు కొచ్చినట్లు అనిపిస్తోంది రుద్రప్పకు.

ఆప్యాయంగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు. అతడి చెయ్యి వణుకుతోంది ఆవేశంతో.

"కమలా!" అన్నాడతను.

అది మామూలు పిలుపు కాదు. హృదయ లోతుల్లోంచి వెలువడిన అనురాగ స్వరం.

ఆమె అతడివైపే చూస్తోంది.

అమాంతంగా అతడు లేచాడు. వణికే చేతుల్తో ఆమెను కౌగలించుకున్నాడు.

"నా కమల నువ్వే! నా ప్రార్థనలకు కరిగిపోయి దైవం నిన్ను నా దగ్గరకు పంపాడమ్మా" అన్నాడతను వుద్రేకంతో.

"నాన్నగారూ, మీరు కూర్చోండి. ఎక్కువగా ఆవేశ పడొద్దు" అందామె.

రుద్రప్ప కూర్చున్నాడు. పక్కనే ఆమె కూర్చుంది. అతడు ఆమెవైపు చూస్తూ వుండిపోయాడు.

"అమ్మా, నువ్వు యెప్పుడు పుట్టావు?"

"మార్చి 7, 1965."

అతను తృప్తిపడ్తూ ఎదురుగా కూర్చున్న రామచంద్ర మూర్తివైపు చూశాడు.

"అదే సమయంలో మన కమల మరణించింది" అన్నాడు రామచంద్రమూర్తి.

పుట్టిన తారీఖు విషయంలో నాగేష్ ఆమెకు బాగా కోచింగ్ ఇచ్చాడు. అతడు చెప్పమన్నట్లే ఆమె చెప్పింది.

యూనిఫామ్‌లో వున్న బట్లర్ ట్రే పట్టుకుని అక్కడి కొచ్చాడు. ట్రేను టీపాయిమీద పెట్టి గ్లాసులను వాళ్ళకు అందించాడు.

పైనాపిల్ జూస్!

"తాగు కమలా" అన్నాడు రుద్రప్ప.

"మీరూ తాగండి" అందామె.

"తండ్రీ కూతుళ్ళు నన్ను మర్చిపోతున్నారు!" అన్నాడు రామచంద్రమూర్తి.

"మమ్మల్ని కలిపిన మహానుభావుడవు నీవేనయ్యా!" అన్నాడు రుద్రప్ప.

తొమ్మిదింటికి ముగ్గురూ డైనింగ్ గదిలోకి వెళ్ళారు.

రుద్రప్పకిరువైపులా కమల, రామచంద్రమూర్తి కూర్చున్నారు.

యూనిఫామ్‌లో వున్న బట్లర్ పదార్థాలతో కంచాలను వాళ్ళముందు పెట్టాడు.

పెద్ద కంచాల్లో వున్న పదార్థాలను చూసి ఆమె ఆశ్చర్యపోయింది.

"కమలా, నీ తల్లిదండ్రులు వున్నారా?"

"లేరండి."

"అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు...."

"లేరు."

"నాలాగే ఒంటరిదానివి."

ఆమె తలాడించింది.

"నువ్వు నా కళ్ళముందుంటే అమ్మాయి వున్నట్టే అనిపిస్తుంది. హోటల్ వదిలి నువ్వు ఇక్కడే వుండాలి" అన్నాడు రుద్రప్ప.

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"మీ ప్రేమ చూస్తూంటే మిమ్మల్ని విడిచిపోవాలని అనిపించడంలేదు నాకు" అందామె.

"అయితే ఇక్కడే వుంటావా?"

"నన్ను ఆకర్షిస్తున్నది మీ ఆప్యాయత. ఆలోచించి త్వరలో చెప్తాను."

"కమలా, వైజాగ్ నుంచి నువ్వు బెంగుళూరు ఎందుకొచ్చావు?"

"ఉద్యోగం కోసం."

"నీకు ఉద్యోగం ఎందుకమ్మా? నాతో ఆఫీసుకొచ్చి మన కంపెనీలను నువ్వు మేనేజ్ చేయొచ్చు."

"అదంతా చేయడానికి అనుభవం కావాలి"

అందామె.

"చేస్తూ వుంటే అనుభవం వస్తుంది" అన్నాడు రుద్రప్ప.

మాట్లాడుకుంటూ వాళ్ళు భోజనాలు చేస్తున్నారు.

అదే సమయంలో నాగేష్, పద్మరాజు హోటల్ గదిలో చాలా వుషారుగా వున్నారు — ఇద్దరూ పీటర్ స్కాట్ విస్కీ సేవిస్తున్నారు.

నాగేష్ టైము చూశాడు. పది దాటింది.

"ఆమె వచ్చిందేమో చూడు!" అన్నాడు నాగేష్.

పద్మరాజు బయటకు వెళ్ళి కాస్సేపట్లో తిరిగొచ్చాడు.

"ఇంకా రాలేదు" అన్నాడతను.

"రుద్రప్ప ఆమెను తొందరగా వెనక్కు పంపేస్తే నా ప్లాన్ సాగదు. ఆమె ఆలస్యంగా తిరిగి రావాలి" అన్నాడు నాగేష్.

"నాగేష్, ఆమెను అక్కడికి పంపాం. ఇటుపైన నీ ప్లాన్ ఏమిటి?" అడిగాడు పద్మరాజు.

"ఆమెను రుద్రప్ప అక్కడే వుండమంటాడు. ఆమె రుద్రప్పకు కూతురవుతుంది. కొన్ని రోజులు పోయాక ఒక యువకుడిని ప్రేమించానని ఆమె అతడితో చెప్తుంది. నన్ను తీసుకెళ్ళి తన ప్రియుడిగా రుద్రప్పకు పరిచయం చేస్తుంది. మా పెళ్ళి అవుతుంది. బిజినెస్ మేరేజి! నేనూ ఆ ఇంటికి మారిపోతాను. ముసలాడు రుద్రప్ప యెక్కువ కాలం బతకడు. ఆ ఆస్తి అంతా నాదవుతుంది. బాగుందా?"

"ప్రొసీడ్!"

"రుద్రప్ప పోగానే కమలకు డబ్బిచ్చి పంపేస్తాను. ఆ ఆస్తిని మనిద్దరం అనుభవించవచ్చు. మనం ఇటుపైన ఏ

సేరాలూ చెయ్యనక్కర లేదు. ఎలా వుంది?"

"అంతా బాగుంది కాని కమలను నేను ప్రేమిస్తున్నాను. ఆమెను నేను పెళ్ళాడతాను" అన్నాడు పద్మరాజు.

నాగేష్ గ్లాసులోని విస్కీని తాగి గంభీరంగా నవ్వాడు.

"రాజూ, ఆమెను నేను పెళ్ళాడ్డం బిజినెస్ కోసం. తర్వాత మన పని పూర్తయ్యాక ఆమె నీదే!"

"నీకు బదులు నన్ను ఆమె తన ప్రియుడిగా రుద్రప్పకు పరిచయం చేయొచ్చుగా?"

"రాజూ, నేనక్కడికి చేరుకుంటే రుద్రప్ప తొందరగా స్వర్గానికి వెళ్తాడు! నా అంత వేగంగా నువ్వు రుద్రప్పకు విముక్తి నియ్యలేవు" అన్నాడు నాగేష్ నవ్వుతూ.

పద్మరాజు విస్కీ తాగి నాగేష్ వైపు చూశాడు. ఆ క్షణంలో ఎందువలనో నాగేష్‌ని చూస్తూంటే అతడికి భయం వేసింది.

11

నెలరోజులనుంచి కమల రుద్రప్ప ఇంట్లోనే వుంటోంది. కమలంటే రుద్రప్పకు ప్రాణం.

ఒకనాడు అతడు ఆమె పెళ్ళి గురించి మాట్లాడాడు.

"అమ్మాయి, నేనుండగానే నీ పెళ్ళి అవ్వాలి" అన్నాడతను.

"నాన్నా, నేనొక యువకుడిని ప్రేమించాను. అతడినే పెళ్ళాడతాను" అందామె.

"అది నాకు చెప్పలేదే? వెంటనే అతడిని ఇక్కడకు రమ్మను. నేను అతడితో మాట్లాడి అంతా చేస్తాను" అన్నాడతను.

ఆమె అతడివైపు చూసింది.

"నాన్నా, పెళ్ళయినా మిమ్మల్ని వదిలి నేను యెక్కడికీ పోను. నన్ను పెళ్ళాడే వ్యక్తి యిక్కడే నాతో వుండాలి" అందామె.

"అదంతా నేను చూస్తానమ్మాయి" అన్నాడు రుద్రప్ప.

"అతడిని ఎప్పుడు రమ్మనను?"

"ఇవాళ రాత్రి ఏడింటికి రమ్మను" అన్నాడు రుద్రప్ప.

నాగేష్, పద్మరాజు బీరు సేవిస్తున్నారు. గదిలోని టెలిఫోన్ మ్రోగింది.

"ఎవరై వుంటారు?" అన్నాడు పద్మరాజు.

"ఇంకెవరు, నీ కమల" అన్నాడు నాగేష్.

నాగేష్ రిసీవర్ ఎత్తాడు.

"హలో!" అన్నాడు.

"కమలని."

"నాగేష్."

"నాన్నతో అంతా చెప్పాను. ఇవాళ రాత్రి మిమ్మల్ని ఏడింటికి రమ్మన్నారు."

"కమలా, కంగ్రాట్స్! రాత్రి వస్తాను. దీనితో నా ప్లాను మూడొంతులు ఫలించినట్లే" అన్నాడు నాగేష్.

"మీ ప్లాను ఏమిటో నాకు అర్థం కావడంలేదు."

"డోంట్ వర్రీ! నీకు తెలియకపోవడం మంచిది. అన్నీ నేను చూస్తాను."

అతడు రిసీవర్ పెట్టేశాడు.

సాయంత్రం ఆరింటికల్లా నాగేష్ రెడీగా వున్నాడు.

"విస్కీ తీసుకుంటావా?" పద్మరాజు అడిగాడు.

"నువ్వు తాగు. నాకు ఒక్క బడా పెగ్ చాలు. మంచివాడిలా రుద్రప్పకు కనిపించాలి" అన్నాడు నాగేష్.

రెండు గ్లాసుల్లో పద్మరాజు విస్కీ పోశాడు. ఇద్దరూ తాగడం ప్రారంభించారు. నిమిషాలు గడుస్తున్నాయి.

"నాగేష్ ఎలా వెళ్తావు?"

"టాక్సీలో."

"నేనూ రానా?"

"నన్ను అక్కడ దింపేసి వెనక్కు నువ్వు వచ్చేయి. రుద్రప్ప నన్ను అతడి కారులో పంపుతాడు" అన్నాడు నాగేష్.

సరిగ్గా 6.45కి ఇద్దరూ బయటకు నడిచారు. టాక్సీలో కూర్చున్నారు. టాక్సీ కదిలింది. నాగేష్ పక్కనున్న పద్మరాజు చెయ్యి పట్టుకున్నాడు.

"రాజా, నా ప్లాన్ ఫలించడంకోసం కమలను పాన్‌గా నేను వాడుతున్నాను. ఆమె ఎప్పుడూ నీదే! మీ ఇద్దర్నీ ఎవ్వరూ విడదీయలేరు" అన్నాడు నాగేష్.

టాక్సీ స్పీడుగా వెళ్తోంది. వెనుకనుంచి లారీ వస్తోంది. నాగేష్ ఏదో చెప్తున్నాడు.

అమాంతంగా భయంకరమైన చప్పుడు అయింది. లారీ వెనుకనుంచి టాక్సీని బలంగా కొట్టింది.

టాక్సీ తలుపు తెరుచుకుంది. పద్మరాజు కిందపడ్డాడు.

టాక్సీ తలక్రిందులైంది.

షాక్‌తో క్షణకాలం పద్మరాజు లేవలేకపోయాడు. మెల్లిగా బలం పుంజుకుని లేచాడు. విచిత్రంగా అతడు గాయపడలేదు.

టాక్సీ దగ్గరకు వెళ్ళాడతను. స్టీరింగ్ రాడ్ డ్రయివర్ గుండెల్లో గుచ్చుకుపోయింది. నాగేష్ బుర్ర పగిలి రక్తం కార్తోంది. "వాళ్ళను హాస్పిటల్‌కు వెంటనే తీసుకు వెళ్ళండి" అన్నారెవరో.

మరో టాక్సీలో డ్రయివర్నీ, నాగేష్‌నీ హాస్పిటల్‌కు చేర్చారు. అదే టాక్సీలో వెళ్ళాడు పద్మరాజు.

డాక్టర్ ఇద్దర్నీ పరీక్షించాడు.

పద్మరాజు ఆత్రంగా డాక్టర్ వైపు చూశాడు.

"లాభంలేదు. ఇద్దరూ మరణించారు" అన్నాడు డాక్టర్.

"డాక్టర్, నా మిత్రుడు. శవాన్ని నేను తీసుకు వెళ్ళవచ్చా?"

"ఇది ఫేటల్ యాక్సిడెంట్. పోలీసులు వస్తారు. వాళ్ళకు మేము రిపోర్టివ్వాలి. రేపు ప్రొద్దుట మీకు శవాన్ని ఇస్తాం" అన్నాడు డాక్టర్.

పద్మరాజు బయటకు నడిచాడు. విధి నాగేష్ ప్లాన్‌కు అడ్డుపడింది. ఇప్పుడు ఏమవుతుంది?

హాస్పిటల్ బయటనున్న టాక్సీలో కూర్చుని పద్మరాజు శరవేగంగా రుద్రప్ప యింటికి చేరుకున్నాడు.

విచారవదనంతో ముందు హాల్లోకి వెళ్ళాడు. కమల అతడికి ఎదురైంది. అతడివైపు ఆశ్చర్యంగా చూసింది.

"నాగేష్ రాలేదా?" అందామె.

"అతడు రాలేకపోయాడు."

"ఏమైంది?"

"విధి అతడి ప్లానుకు అడ్డుపడింది. టాక్సీ యాక్సి డెంట్‌లో అతడు మరణించాడు."

ఆమె తృళ్ళిపడింది. అతడివైపు ఆమె సూటిగా చూసింది.

"విధి అడ్డుపడలేదు. విధి నాగేష్ ప్లాన్ను మర్చింది" అందామె.

పద్మరాజు ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు.

"లక్కీ, నేను నాన్నతో నా ప్రియుడి పేరు చెప్ప లేదు. మీరే నా ప్రియుడని నాన్నకి పరిచయంచేస్తాను" అందామె.

అప్పుడే రుద్రప్ప కిందకొచ్చాడు. ఆమె అతడిని పరిచయం చేసింది. అతడివైపు రుద్రప్ప పరీక్షగా చూశాడు. అతడి చూపు కమలవైపు తిరిగింది.

"అమ్మాయి, త్వరలో మీ పెళ్ళి వైభవంగా చేయిస్తాను. గాడ్ బ్లెస్ యు!" అన్నాడు రుద్రప్ప.

"నామీద మీ కింత నమ్మకం ఏర్పడినందుకు ఆనంది స్తున్నాను" అన్నాడు పద్మరాజు.

రుద్రప్ప కుర్చీలోంచి లేచాడు.

"అమ్మాయి, అతను డిన్నర్‌కి ఇక్కడే వుంటాడు. నువ్వు అతడితో మాట్లాడుతూ వుండు. నేను స్నానం చేసి వస్తాను" అని రుద్రప్ప మేడమీదకు వెళ్ళిపోయాడు.

12

రెండు నెలలు గడిచిపోయాయి. కమలతో పద్మరాజు పెళ్ళి ఎంతో వైభవంగా జరిగింది.

హనీమూన్‌కి పద్మరాజు కమలతో సహా మద్రాసు చేరుకున్నాడు. హోటల్ చోళాలో వాళ్ళు గది తీసుకున్నారు.

"ఇవాళ నేను తలంటు పోసుకోవాలి" అంది కమల.

"నేను అలా వెళ్ళి కొందరు మిత్రుల్ని చూసొస్తాను" అన్నాడు పద్మరాజు.

పద్మరాజు టాక్సీలో నాగేష్ ఇంటికి వెళ్ళాడు. అతడి తల్లిని కల్సుకున్నాడు.

"రాజూ, నువ్వా? నాగేష్ ఏడీ?" అందామె.

అతడు విచారవదనంతో నాగేష్ చావు వార్త చెప్పాడు. ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది.

"అమ్మా, నువ్వు భయపడకు. నాగేష్ నా అన్న లాంటివాడు. నీకు ప్రతి నెలా నేను వెయ్యి రూపాయిలు పంపుతాను. ఏ బాధా లేకుండా నువ్వు జీవించాలి. నాగేష్ కోరింది అదే!" అన్నాడతను.

బాగ్‌లోంచి వెయ్యి రూపాయిలు తీసి ఆమెకిచ్చాడు.

"నాయనా, వృద్ధిలోకొచ్చావు. సంతోషం" అందామె.

అదే టాక్సీలో అతడు మనియన్ స్టోర్స్‌కు వెళ్ళాడు. ప్రొప్రయిటర్ ముందుకు నడిచాడు. మనియన్ అతడి వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"ఏం కావాలి సార్?" అడిగాడతను.

"కొంతకాలం క్రితం మీకు 25 వేలు నష్టం వచ్చింది. ఎవరో మీకు రావలసిన డబ్బు తీసుకుని పారిపోయారు" అన్నాడు పద్మరాజు.

"వాడు మీకు తెలుసా?"

183

"తెలుసు. అలా చేయడం మంచిది కాదని అతడితో చెప్పాను. మీకిమ్మని అతడు 25 వేలు నాకిచ్చాడు."

నోట్లకట్టలను పద్మరాజు ప్రొప్రయిటర్ కి ఇచ్చాడు.

"ఇది తిరిగి వస్తుందని నేను కలలో కూడా వూహించ లేదు" అన్నాడు మనియన్ సంతోషంగా.

పద్మరాజు ప్రొప్రయిటర్ కేసి చూశాడు.

"మనం వూహించని విధంగా ఎన్నో సంఘటనలు జరుగుతూ వుంటాయి" అని పద్మరాజు తన టాక్సీవైపు నడిచాడు.

—:అ యి పో యిం ది:—